


www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 23 | 15-03-2021 | పుటలు : 4




మార్చి 11
మహాశివరాత్రి పర్వదిన
శుభాకాంక్షలు!!


## మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలి



### వీసీ మొక్కా జగన్నాథరావు

**08.03.21 (మీడియా సెల్)** మహిళలు అన్ని రంగాల్లో విజయాలను సాధించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా.కె.నూకరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, అడిషనల్ ఎస్పీ కె.లతామాధురి, అడ్వకేట్ వి.ఉమామహేశ్వరి, డాక్టర్ డి.పద్మజ, వి.ఎస్.కె. కాలేజ్ ప్రిన్సిపాల్ ఎ.వి.రమణ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోను విజయం సాధించాలని ఆధునిక పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలలో స్థిరపడాలని అన్నారు. తల్లిదండ్రులు అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను చూడాలని తద్వారా సమాజంలో వివక్షత దూరమవుతుందని చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని ఎక్కువ మంది మహిళల

4 పేజీ ▲



పారిపోదా అహంకారం
కాచి వడబోసుకుంటే నిన్నునువ్వే !
ఒదిలిపోదా జిడ్డు ఉతికి ఆరేసుకుంటే
నిన్నునువ్వే !
ఈ ముసుగు కప్పుకుని
ఎంతకాలం మనసునీడ్చుకెళతావు ?!

**- ఆచార్య సి.నారాయణరెడ్డి**

## పరిశుభ్రమైన సమాజ నిర్మాణానికి పాటుపడదాం


**10.03.21 (మీడియా సెల్)** పరిశుభ్రమైన సమాజ నిర్మాణానికి సమష్టిగా పాటుపడదామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత యాక్షన్ ప్లాన్ లో భాగంగా మాసీవ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ లో నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. స్వచ్ఛత యాక్షన్ ప్లాన్ అంటే కేవలం పరిసరాల్లో చెత్తను తొలగించడం మాత్రమే కాదని బహిరంగ ప్రదేశాలలో ఎవరు చెత్తను, వ్యర్థపదార్థాలను వేయకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వ్యర్థాలను కేటాయించిన స్థలాల్లో వేయడం అలవాటు చేస్తే సమాజం పరిశుభ్రంగా ఉంటుందని స్వచ్ఛ కార్యక్రమాలతో విద్యార్థులు వ్యర్థాలను తొలగించాల్సిన అవసరం ఉండదని తెలియజేసారు. కాలుష్య రహిత సమాజాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్.ఎస్.ఎస్ వాలంట్రీలు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యర్థాలను తొలగించి స్వచ్ఛత యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని విజవంతం చేసారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్



సూపరింటెండెంట్ చాగంటి రవీంద్రనాథ్, రైల్వే సి.ఐ రమేష్ బాబు, వైద్యశాఖ సిబ్బంది, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

### మెడికల్ సూపరింటెండెంట్ డా.జి. సోమసుందరరావు తో ఇంటర్వ్యూ



**రాజమహేంద్రవరం జిల్లా హాస్పటల్ లో మెడికల్ సూపరింటిండెంట్ గా డా.జి. సోమసుందరరావు కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన విద్యార్థుల అనగాహాన సదస్సుకు ఆయన హాజరయ్యారు. (వారితో ఎడిటర్ ముఖాముఖీ)**

**సార్. నమస్సులు! తమ విద్యాభ్యాస విషయాలు తెలియజేయండి.**
నేను ప్రాధమిక విద్యాభ్యాసం రామచంద్రపురంలో సాగింది. ఎంబిబిఎస్ 1975-80, ఎం.ఎస్. 1982-85 రంగరాయ మెడికల్ కాలేజ్ కాకినాడలో పూర్తి చేసాను. పి.జి.డి.హెచ్.ఎస్.సి 2007వ సంవత్సరంలో చేసాను.

**ఉద్యోగ జీవితం ఎప్పుడు ప్రారంభం అయింది.**
1986వ సంవత్సరంలో ప్రభుత్వ సేవలలో ప్రవేశించాను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు శ్రీకాకుళం, కృష్ణా జిల్లాలలో పని చేసాను. ప్రస్తుతం రాజమహేంద్రవరం మెడికల్ సూపరింటిండెంట్ గా విధులు నిర్వహిస్తున్నాను.

**మద్యపానం, మాదక ద్రవ్యాలకు ఏ ఏ చికిత్సలు ఉంటాయి.**
మత్తుకు బానిసగా మారిన వ్యక్తి మార్పును కోరుకుంటే చికిత్స సులభతరం అవుతుంది. మద్యపానం మాదక ద్రవ్యాలకు హాస్పటల్ సైకాలజీ విభాగం ప్రత్యేకంగా పని చేస్తుంది. మత్తుతో వచ్చే దుష్ ఫలితాలను, పరిస్థితులను, శరీర బలహీనతలను, క్షీణత దశలను వివరించి కౌన్సిలింగ్ ను ఇస్తారు. ప్రత్యేక మందులు ద్వారా వాటికి దూరం చేయవచ్చు. ఇది వైద్యుల పర్యవేక్షణలో జరగాల్సిన ప్రక్రియ. మందులు, కౌన్సిలింగ్ రెండు కీలక పాత్రను పోషిస్తాయి.

**యువతకు మీరు ఇచ్చే సూచన**
దయచేసి మత్తు పదార్థాలకు బానిస కావద్దు. మత్తుకు బానిసగా మారి సర్వాన్ని కోల్పోయిన వారిని ఎంతో మందిని ప్రత్యక్షంగా చూసాను. హాస్పటల్ కు భార్యలు వచ్చి మత్తుకు బానిసగా మారిన భర్త చస్తే బాగుంటుందని కోరుకుంటారు.

**నన్నయ విశ్వవిద్యాలయం వైద్య సేవలపై మీ అభిప్రాయం**
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లో డాక్టర్ వినయ్ సుంకర హెల్త్ సెంటర్ అందుబాటులో ఉంది. విద్యార్థులకు ఏదైన అనారోగ్యం సంభవిస్తే ప్రాథమిక ఆరోగ్యం ఈ హెల్త్ సెంటర్ ద్వారా అందుతుంది. ప్రాథమిక ఆరోగ్య సేవలకు సంబంధించిన వసతులు ఇక్కడ ఉన్నాయి. అత్యవసరమైన వైద్య సేవల కోసం విశ్వవిద్యాలయ వాహనాలలో జిల్లా ఆసుపత్రికి తీసుకువస్తే మేము వైద్యం అందిస్తాం.

మంచిదండి. రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రిలో మీరు అందిస్తున్న సేవలు మరిన్ని ఫలితాలను ఇవ్వాలని, మద్యపానం, మాదకద్రవాలకు యువత దూరంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాం. నన్నయవాణి తరుపున కృతజ్ఞతల్ని అందిస్తుంది.

**నమస్కారం సార్. థ్యాంక్స్, మళ్ళీకలుద్దాం.**

# సంపాదకీయం



## విద్యార్థులారా...!!

మన జాతి సంపద మీరే! ‘మీదే, మీదే సమస్త విశ్వం! మీరే లోకపు భాగ్యవిధాతలు!!’ అంటారు శ్రీశ్రీ. మీరు ఎదుగుతున్న క్రమంలో మీకు రోల్ మోడల్స్ అమ్మ, నాన్న, ఉపాధ్యాయులు.

జాతి జీవితంలోని అన్ని రంగాల్లో, రాజకీయాల్లో, వైజ్ఞానిక శాస్త్రాల్లో, సాంకేతిక విజ్ఞానంలో, పారిశ్రామిక రంగంలో శ్రేష్టులైన, నీతి పరులైన, విలువలు కలిగిన వ్యక్తులు రోల్ మోడల్స్ అవుతారు.మీరిప్పుడు గొప్ప గతానికి,మహోన్నత భవితకు నడుమ వారధులు.మీలో నిద్రాణంగా ఉన్న శక్తిని రగిలించి అది మీకు దారి చూపేటట్లు చేసుకోవాలి. అది మీ చేతుల్లోనే ఉంది.

మనమేది చేయాలని అనుకుంటామో, చెయ్యాలని కలగంటామో ఆ పనిని వెంటనే మొదలు పెట్టాలి. సాహసం లోనే ప్రతిభ ఉంది. శక్తి ఉంది. కాబట్టి ‘చేయాల్సిందేదో తక్షణమే మొదలుపెట్టాలి’ అంటారు గోథే పండితుడు.

జె.ఆర్.డి.టాటా, విక్రమ్ సారాభాయ్, సతీష్ ధావన్, డా.వర్గీస్ కురియన్, అబ్దుల్ కలాం స్థాయికి చెందిన క్రాంతదర్శుల వంటి వారు రాబోయే కాలానికి, ఈ సమాజానికి చాలా అవసరం. ఇవి కొంత మంది పేర్లు మాత్రమే. దేశానికంతటికీ లబ్ధి చేకూర్చే నిర్దిష్ట ధ్యేయాల సాధనకు మీరంతా భాగస్వాములు అయితేనే గొప్ప వ్యక్తులుగా ఈ సమాజానికి అవసరమవుతారు. మీరు అటువంటి వారుగానే కాగలగాలి.మీలో దాగి వున్న ఉన్నత వ్యక్తిత్వాన్ని మేలుకొల్పాలి. నిర్మాణాత్మకమైన భవిష్యత్తు గురించే నిరంతరం కృషి చేస్తూ ఉండాలి.అటువంటి దినచర్య వల్లనే మీ హృదయం గొప్ప శాంతి, సౌభాగ్యాలను లోకానికి అందిస్తుంది. ‘మనమెలా ఉన్నామని నమ్ముతుంటామో అలానే పరిణమిస్తామని’ అంటారు గాంధీజీ.మనకది సాధ్యమని, నేను సాధించగలుగుతానని నమ్మ గలిగితే, అటువంటి ఆత్మవిశ్వాసం ఉండగలిగితే మీరు అనుకున్న దానిని సాధించుకోగలుగుతారు.ఇది నిజం.

‘కలలు కనండి. అవి భావాలుగా మారుతాయి. భావాలు కార్యాచరణగా ఫలిస్తాయంటారు’ అబ్దుల్ కలాం. మీ కలల్ని నిజం చేసుకునే ప్రయత్నంలో తల్లిదండ్రుల్ని, మిత్రుల్ని, అధ్యాపకుల్ని, పుస్తకాల్ని, ప్రయోగశాలల్ని, అంతర్జాలాన్ని, సమస్త వ్యవస్థలను కూడగట్టుకోండి. సమయపాలనను నియమంగా చేసుకోండి. మంచి మాటలతో, ప్రవర్తనతో, నిజాయితీతో, గొప్ప మూర్తిమత్వంతో మసలండి.

**చదువు కాలక్షేపం కాదు. లక్ష్యం. మీ జీవితం మీ చేతుల్లో ఉంది. తక్కినవన్నీ ఉపకరణాలు, సౌకర్యాలు మాత్రమే! విద్యార్థులారా! నన్నయవాణి మీనుండి ఆశిస్తున్నది ఇదే!! విజయోస్తు!!!**

# డేటా ఎనలిటిక్స్ పై అధ్యాయనం

### “వినిమయ” లెక్చర్ క్లబ్ లో ఆచార్య పి.సురేష్ వర్మ



**12.03.21 (మీడియా సెల్)** డేటా ఎనలిటిక్స్ అండ్ క్లౌడ్ కంప్యూటింగ్ పై అధ్యాయనాలు జరుగుతున్నాయని భవిష్యత్ లో దీనికి అధిక ప్రాధాన్యత ఉంటుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ విభాగాచార్యులు పి.సురేష్ వర్మ అన్నారు. ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన “వినిమయ” లెక్చర్ క్లబ్ లో ఆచార్య పి.సురేష్ వర్మ ఉపన్యాసం చేశారు. విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ఈ లెక్చర్ లో వీసీ ఆచార్య జగన్నాథరావు, ప్రిన్సిపాల్స్, డీన్స్, అధ్యాపకులు హాజరైయ్యారు.

ఈ సమావేశంలో ఆచార్య పి.సురేష్ వర్మ మాట్లాడుతూ “డేటా ఎనలిటిక్స్ అండ్ క్లౌడ్ కంప్యూటింగ్ ఫర్ ఆల్” అనే అంశంపై ఉపన్యసించారు. ఆధునిక యుగంలో సమాచార వ్యవస్థ అత్యంత కీలక పాత్రను పోషిస్తుందని, సాంకేతిక పరిజ్ఞానంతో సులవైన సమాచారాన్ని అందుకుంటున్నామని అన్నారు. డేటా ఎనలిటిక్స్ సంప్రదాయ పద్ధతుల నుండి ఆధునిక సాంకేతిక పద్దతుల రూపాంతరం చెందిన తరువాత ఎంతో సులభతరం అయిందని పరిశోధన అంశాలకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. డేటా విజ్యువలెజేషన్, డేటా చార్ట్ తదితర అంశాలను తెలియజేసారు. క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా ఎక్కువ ప్రయోజనాలను తక్కువ సొమ్ముతోనే పొందవచ్చునని అన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అప్లికేషన్ ను ఉపయోగించి మిని రోబోను తయారు చేసి వివిధ అప్లికేషన్స్ ను ఏ విధంగా నియంత్రించవచ్చునో ప్రయోగాత్మకంగా వివరించారు. వీసీ మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఇటువంటి లెక్చర్ క్లబ్ ల ద్వారా ఆయా విభాగాల్లో నిష్ణాతులైన ఆచార్యుల విజ్ఞానం అందరికి అందుతుందని తెలియజేసారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలో అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సాఫ్ట్ వేర్ ప్రాజెక్టులపై పట్టు సాధించండి

### కెపిఎంజి కన్సల్టెంట్ వై.వి.సునీల్ సుబ్రహ్మణ్యం




**12.03.21 (మీడియా సెల్)** సాఫ్ట్ వేర్ ప్రాజెక్టులపై ఇంజనీరింగ్ విద్యార్థులు పట్టు సాధించాలని కెపిఎంజి సాఫ్ట్ వేర్ కన్సల్టెంట్ వై.వి.సునీల్ సుబ్రహ్మణ్యం అన్నారు. విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో “అప్లికేషన్స్ ఆఫ్ ఇండస్ట్రీ ప్రాక్టిసెస్ ఇన్ సాఫ్ట్ వేర్ డెవలప్మెంట్ లైఫ్ సైకిల్ గెయినింగ్ టువర్డ్స్ డిజిటల్ కాంపిటీటివ్ అడ్వాంటేజ్” అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కన్వీనర్, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యాపరమైన, సేవాపరమైన అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో బ్లడ్ డోనార్ హబ్, కోవిడ్ సేవలు, వెబినార్లు, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నామని తెలిపారు. రిసోర్స్ పర్సన్ గా హాజరైన కెపిఎంజి కన్సల్టెంట్ వై.వి.సునీల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కోవిడ్ కారణంగా డిజిటల్ యుగం ఆవశ్యకత మరింత పెరిగిందని అన్నారు. విద్య, విజ్ఞానం, వినోదం తదితర అంశాల్లో సాంకేతికత ప్రభావం ఏ విధంగా ఉందో వివరించారు. డిజిటల్ యుగంలో రాణించాలంటే విద్యార్థులు సాంకేతిక విజ్ఞానంపై ఎక్కువ సాధన చేయాలని అన్నారు. సాఫ్ట్ వేర్ ప్రాజెక్టులపై పట్టు సాధించాలని స్వయంగా సాధించిన ప్రాజెక్టులు మంచి ఫలితాలను, ఆనందాన్ని ఇస్తాయని చెప్పారు. ఇంటర్వ్యూలలో ఎటువంటి మెలుకువలు పాటించాలో తెలియజేసారు. అజైల్ మెథడాలజీ గుర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు రాహుల్, హనుమంతు, కెజియా తదితరులు పాల్గొన్నారు.

## మంచి మాట



మనకి కేవలం విషయాల్ని ప్రతిపాదించేది మాత్రమే కాదు. మనజీవితాన్ని లయాత్మకంగా చైతన్యంతో స్పందింపజేసేదే- ఉత్తమవిద్య!

– స్వామి వివేకానంద




## ప్రతిభా వాణి

### సరోజిని నాయుడు



దేశం బానిస తనం నుంచీ, నియంతృత్వ సంకెళ్ళ నుంచీ విముక్తి పొంది నాది, నేను అన్న భావంతో అఖిల భారత ప్రజానీకం స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో జీవించాలన్నదే వారి మహత్తర ఆశయం. అటువంటి పూజనీయులైన పురుషులే కాక, భారత మహిళలు ఏ రంగంలోనూ, తీసిపోరని నిరూపించిన వీరమహిళలు మన దేశంలో చాలా మంది పుట్టారు. అటువంటి వారిలో శ్రీమతి సరోజినీ నాయుడు కూడా ఒకరు. సరోజిని నాయుడు మంచి రచయిత్రి.

క్రీ.శ. 1879 వ సంవత్సరం ఫిబ్రవరి నెల 13 వ తేదీన హైదరాబాద్ లో జన్మించారు. తండ్రి డా. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, తల్లి శ్రీమతి వరద సుందరి. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ హైదరాబాదు కాలేజికి, (అనగా నేటి నిజాం కాలేజీ) మొట్టమొదటి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసారు. తల్లి వరదాదేవి చక్కని రచయిత్రి. చిన్నతనం నుంచీ ఆమె బెంగాలీ భాషలో కావ్యాలు, కథలు రాశారు. తండ్రి గారైన అఘోరనాథ్ ఎనిమిది భాషలలో పండితుడు. సంస్కృతం, బెంగాలీ, ఉర్దూ, గ్రీకు, జర్మనీ, హిబ్రూ, ఫ్రెంచ్, ఆంగ్లం మొదలైన భాషలు ఆయనకు అనర్గళంగా వచ్చు. వీరు ఎడింబరో విశ్వవిద్యాలయంలో డాక్టరు పట్టాను పొందారు.

శ్రీమతి సరోజినీ నాయుడు తల్లి దండ్రులు విద్యాధికులవటం వలన, ఆమెలో చిన్నతనం నుంచే కార్యదీక్ష, పట్టుదల, విద్యపై తిరుగులేని సదభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఏది చూసినా ఎవరి మాటలు విన్నా పట్టించు కోకుండా తమ ఆలోచనల్లో తాముంటారు చాలా మంది. కొందరు ఆ విధంగా కాక బాల్యం నుంచి ప్రతి విషయం లోనూ కుతూహలం కనబరచి ఏది, ఏమిటో తెలుసుకొనే వరకూ విశ్రమించరు. రెండవ కోవకు చెందిన మేధావి శ్రీమతి సరోజినీ నాయుడు. చిన్నతనం నుంచీ ఆమెకు ఇంగ్లీషు భాషమీద చాలా మక్కువ ఉండేది. ఇంగ్లీషు మాట్లాడాలని ఆమె ఎంతగానో ప్రయత్నిస్తూండేది. ఆ పట్టుదలా, ధ్యేయాలతోనే ఇంగ్లీషు భాషను ఎంతో శ్రద్ధగా అభ్యసించింది. సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్ లో చదువుకుంది. పదకొండో సంవత్సరం వచ్చేసరికి ఆమె అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఆ వయసులోనే ఇంగ్లీషులో రచనలు ఆరంభించింది కూడా!

ఆమె పన్నెండవ ఏట మదరాసు విశ్వవిద్యాలయం మెట్రిక్యులేషన్ పూర్తి చేయగలిగిందంటే ఆమె చురుకైన తెలివితేటలూ, విద్య పట్ల ఆమెకు గల భక్తి భావం మనం అర్థం చేసుకోవచ్చు. చాలా మంది విద్యార్థులు నిత్యం పాఠశాలలకు వెళుతూ, విద్య యందు దష్టి నుంచక, గురువులు చెప్పే పాఠాలు, కాలక్షేపానికి భావిస్తూ, గురువులను సాటి విద్యార్థులనూ ఆవహేళన చేస్తూ కాలం విలువ తెలియక ప్రవర్తించి, జీవితంలో అడుగు పెట్టి సాధక, బాధకాలు ఎదురయ్యాక వధా చేసిన కాలం గురించి బాధపడుతుంటారు. అటువంటికి శ్రీమతి సరోజినీ నాయుడు నిజంగా ఆదర్శమూర్తి. భారత దేశ మొదటి మహిళా గవర్నరుగా సరోజిని నాయుడు చరిత్రకెక్కారు. జాతీయోద్యమానికి, ఆంగ్ల కవిత్వానికి విశేష సేవలందించిన నైటింగేల్ ఆఫ్ ఇండియాకిదే

***నన్నయవాణి అక్షర నీరాజనం!!***

## విశ్వవిద్యాలయ రేయిపగల అందాలు






వి. నీహారిక, ఈ.సి.ఈ మొదటి సంవత్సరం

## మదిలో మెదులుతోందా..!




బాల్యంలో బాధను నీదరి
చేరనీయక
గుండెల్లో నిన్ను పదిలంగా
పెంచిన అమ్మ ఋణం
కాస్తయినా తీర్చుకోవాలనే యోచన
నీలో మెదులుతోందా..
నీ చదువుకై, వివాహానికై
అప్పులు, అనుమానాలు
మూటగట్టుకొని
ఆ మూటని చిరునవ్వుతో కప్పేసిన
నీ తండ్రికి చివరి రోజుల్లో
కాస్తయినా ప్రేమను పంచాలనే
ప్రయత్నం
నీ మదిలో మెదులుతోందా..
చివరకు
మృత్యువు ఒడిలో
గతాన్ని పిండితే రాలిన
జ్ఞాపకాలు ప్రశ్నించవా..
నీ జీవన విధానాన్ని దాని
సార్థకతను.

"ప్రతి మనిషిలో బలం, బలహీనత రెండూ ఉంటాయి. బలహీనత గురించి ఆలోచిస్తే బలం మరుగున పడుతుంది. బలాన్ని గుర్తిస్తే బలహీనత మనల్ని వదిలి వెళ్ళిపోతుంది."
– పి.ఎల్.సురేష్, లెక్చరర్, ఛాంబర్స్ డిగ్రీ కాలేజ్, పాలకొల్లు

## ఫ్యాకల్టీ అసోసియేట్లుగా బాధ్యతలు




జానకిరావు, లావణ్యలకు నియామక పత్రాలను అందిస్తున్న వీసీ

**13.03.21 (మీడియా సెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరీక్ష విభాగంలో ఫ్యాకల్టీ అసోసియేట్లుగా విధులు నిర్వహించేందుకు విశ్వవిద్యాలయ క్యాంపస్ కు చెందిన ఇద్దరు సహాయాచార్యులకు ఫ్యాకల్టీ అసోసియేట్లుగా నియమించారు. దీనికి సంబంధించిన ప్రొసిడింగ్ లను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు వారికి అందజేసి వివరాలను తెలియజేసారు. యూజీ పరీక్ష విభాగానికి ఫ్యాకల్టీ అసోసియేట్ గా సోషల్ వర్క్ విభాగ సహాయాచార్యులు డా.ఆర్.జానకిరావు ను నియమించామని అన్నారు. ఎగ్జామినేషన్ కన్ఫిడెన్షియల్ సెక్షన్ కు ఫ్యాకల్టీ అసోసియేట్ గా ఎకనామిక్స్ విభాగ సహాయాచార్యులు డా.ఎ.లావణ్యకుమారిని నియమించామని చెప్పారు. నియామక పత్రాలను వారికి అందజేసి సమర్థవంతంగా విధులు నిర్వహించి విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.లింగారెడ్డి, విభాగ అధ్యాపకులు, సిబ్బంది డా.ఆర్.జానకిరావు, డా.ఎ.లావణ్యకుమారిలను అభినందించారు.

## చిన్నారి పిచ్చుక





చక్కని పర్యావరణం మా విశ్వవిద్యాలయం
చిన్నారి ప్రాణులకు ఆవాసం మా విశ్వవిద్యాలయం
-పి. తిరుమల దేవి, బి.టెక్ మొదటి సంవత్సరం







అపురూపమైన, అందమైన చెట్ల మధ్య, స్వచ్ఛమైన చల్లనిగాలి, చదువుల వెలుగుల మధ్యన మన విశ్వవిద్యాలయం నెలకొని ఉంది. ఆ మహావృక్షం నీడలో కొన్నాళ్ళు చదువుకోవడానికి ఇక్కడ అడుగుపెడతాం. కొత్త మిత్రులు, అందమైన జ్ఞాపకాలు, అనేకమైన పరిచయాలు, కొత్త కొత్త పాఠాలు, పుస్తకాలు, మాస్టార్లు, ఎన్నో కార్యక్రమాలు .... నిన్నటి కన్నా ఈ రోజు అనేక విషయాలు నేర్చుకుంటూ, చదువులతో ఎదిగి పోతూ సంస్కారాన్ని ఒదిగి పట్టుకుంటూ ఉద్యోగాలకై, జీవన సారాంశాన్ని వెతుకుంటూ వెళ్లిపోతాం... ఇదిగో కొత్తగా ప్రవేశించిన అందరికీ మన సీనియర్స్ ఈ విశ్వవిద్యాలయంలోకి స్వాగతం పలుకుతున్నారు..... కొత్త మిత్రులు, కొత్త చదువులతో గొప్ప వ్యక్తులుగా ఈ సమాజానికి ఉపయోగపడాలని, మీరంతా విశ్వవిద్యాలయానికి విద్యా సంపదగా నిలవాలన్నదే **నన్నయవాణి** ఆకాంక్ష !!





## శ్రీకాకుళం నుండి వచ్చాను



ఎం.సి.ఎ. చేయాలని శ్రీకాకుళం నుండి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి వచ్చాను. విశ్వవిద్యాలయం అంటే కేవలం తరగతి గదిలో చదువు మాత్రమే కాదు. విద్యతో పాటు విజ్ఞానం, క్రీడలు, ఎన్.ఎస్.ఎస్ సేవలు, జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనడం అనుభవాలను సంపాదించుకోవడం, పరిశోధనల వైపు అడుగులు వేయడం అనేది నా భావన. కాబట్టి విశ్వవిద్యాలయంలో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటాను.

**ఎన్.జగదీశ్వరరావు, శ్రీకాకుళం**

## పాఠ్యాంశాలు, ల్యాబ్ లు



విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు పాఠ్యాంశాలు చాలా చక్కగా బోధిస్తున్నారు. కంప్యూటర్ ల్యాబ్స్, లైబ్రరీ వంటి ప్రత్యేక వసతులు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. లైబ్రరీ, హాస్టల్స్ లో ప్రత్యేక స్టడీ రూమ్ లను ఏర్పాటు చేసారు. వాటిని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నాం.

**కె.ప్రియాంక, సిద్ధాంతం**

## అధికారుల పర్యావేక్షణ



కాలేజీలలో కాకుండా విశ్వవిద్యాలయం క్యాంపస్ లో ఎం.సి.ఎ. చేయాలని గుంటూరు నుండి వచ్చి చదువుతున్నాను. విశ్వవిద్యాలయం అంటే ర్యాగింగ్ ఉంటుందని భయపడ్డాను. కానీ ఇక్కడ ర్యాగింగ్ అనే భయమే లేదు. సీనియర్ విద్యార్థులు మమల్ని చాలా చక్కగా రిసీవ్ చేసుకున్నారు. అధ్యాపకులు, విశ్వవిద్యాలయ అధికారులు క్లాస్ రూమ్స్ లోను, హాస్టల్స్ లోను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

**బి.కళ్యాణ్ చక్రవర్తి, గుంటూరు**









## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి) విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉన్నత విద్యా కేంద్రంగా ఉందని అన్నారు. నన్నయ క్యాంపస్ లో అబ్బాయిల కంటే అమ్మాయిలు అధిక సంఖ్యలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపక, అధ్యాపకేతర విభాగాలలో మహిళలు కీలక పాత్రను పోషిస్తున్నారని తెలియజేసారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళల గూర్చి ప్రస్తావిస్తూ వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ కె.లతామాధురి మాట్లాడుతూ అమ్మాయిలకు చదువు చాలా అవసరమని, విద్యను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. మహిళ అభ్యున్నతికి వీసీ చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను ఆమె అభినందించారు. అడ్వకేట్ వి.ఉమామహేశ్వరి, డాక్టర్ డి.పద్మజ లు మహిళా చట్టాలను, ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో అధ్యాపకులకు నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లును, జ్ఞాపికలను అందజేసారు. క్యాంపస్ లోని ఆయా కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాసనాలు అందరిని ఆకర్షించాయి. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డా.వి.పెర్సిస్, యూజీసీ కోఆర్డినేటర్ డా.పి.విజయనిర్మల, ఈసీ మెంబర్ డా.కె.సునీత పాల్గొన్నారు.




కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ లో...



